క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికులకు అందని వేతనాలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధి సివిక్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఇప్పటివరకు వేతనాలు అందలేదు. కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల 7వ తేదీలోగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో యజమాన్యమే చెల్లించి తర్వాత రికవరీ చేసుకోవాలని గతంలో డీప్యై సీఎల్సీ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఈనెల 12వ తేదీ వరకు వేతనాలు రాకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగూడెం ఏరియాలో 38మంది కార్మికులు పనిచేస్తుండగా, వేతనాలు రాని విషయంపై ఉన్నతాధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు.

రేపు అయ్యప్ప నిజరూప దర్శనం

ఇల్లెందు: ఇల్లెందులోని హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్.కృష్ణ తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 5.30 గంటలకు నిజరూప దర్శనం, ఆతర్వాత పంచామృత అభిషేకం, మహాపడి, మహా అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఆర్.చంద్రశేఖర్, డి.కృష్ణ, డి.నాగరాజు, పి.స్వర్ణలత, కె.సంధ్య, ఈఓ సూర్యప్రకాశ్‌రావు, పూజారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు

జూలూరుపాడు: కాకర్ల గ్రామ సమీపంలో పాలగుట్టపై గల శ్రీరుక్మిణి సహిత వేణుగోపాలస్వామి దేవాలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.42 లక్షలు మంజూరైనట్లు శ్రీ కృష్ణ సేవా సమితి సభ్యులు తెలిపారు. బుధవారం శ్రీ కృష్ణ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. గుట్ట పైకి వెళ్లే ఘాట్ రోడ్‌ను సీసీ రోడ్డు నిర్మించేందుకు ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ కృషి ఫలితంగా సీఎం కేసీఆర్ ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు ఢిల్లీ వెంకటేశ్వర్లు, చురుకుమల్ల కృష్ణయ్య, అల్లాడి నరసింహారావు పాల్గొన్నారు.

'పొంగులేటితోనే ఉంటాం'

ఇల్లెందు: అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీఆర్ఎస్ శ్రేణులు ఏళ్లకు ఏళ్లు వాడుకుని వదిలేసిందని, అలాంటి నేతతోటే తాము ప్రయాణిస్తామని పలువురు నాయకులు ప్రకటించారు. బుధవారం ఇల్లెందులోని కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కోరం కనకయ్య- పొంగులేటి వెంట నడుస్తామని ప్రకటించారు. నాయకులు ఎలమందరావు, రమేష్, కౌశిక్, పూనం సింగ్, దుర్గ, ఎల్లయ్య, మల్లయ్య, భరత్, రమేష్, వీరస్వామి, వెంకటేశ్వర్లు, రాజు ఉన్నారు.

డీసీసీబీ శాఖకు స్థలం కేటాయించాలి

ఇల్లెందురూరల్: డీసీసీబీ కొత్తగూడెం శాఖ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు సహకరించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియలకు డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కొత్తగూడెం జిల్లాలో డీసీసీబీ సేవలను విస్తృతం చేసేందుకు విశాలమైన కార్యాలయం ప్రధాన వేదికంగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

సొసైటీ డైరెక్టర్‌కు నివాళి

సుజాతనగర్: సర్వారం గ్రామ పంచాయతీకి చెందిన సొసైటీ డైరెక్టర్ మాలోత్ సేవ్యా మృతి చెందగా బుధవారం పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఎంపీటీసీ మూడు గణేష్ తదితరులు ఉన్నారు.

మహిళపై లైంగికదాడికి యత్నం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన బోడా బాలాజీ లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటనపై బుధవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. తండాకు చెందిన బోడా బాలాజీ.. ఓ మహిళపై కొద్ది రోజులుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆమె హెచ్చరించినా బాలాజీ పద్ధతి మార్చుకోలేదు. ఈ నెల 10వ తేదీన బాలాజీ.. సదరు మహిళ ఇంట్లోకి చొరబడి లైంగికదాడికి యత్నించాడు. విషయం భర్తకు తెలిస్తే ఏమవుతుందోననే భయంతో ఆమె నిద్రమాత్రలు మింగి అపస్మారకస్థితికి చేరగా కుటుంబసభ్యులు గమనించి ఆమెను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాలాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శివాజీ గణేశ్ వెల్లడించారు.

ఏదీ ఆనాటి చిత్తశుద్ధి..?!

- అప్పట్లో వైన్స్ వద్దంటే వద్దని పట్టు
- ఇప్పుడు ఊరంతా బెల్ట్ షాపుల్లో మద్యం ప్రవాహం
- ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల ఆగ్రహం



గ్రామపంచాయతీ సరిహద్దులో కొనసాగుతున్న వైన్స్

ఇల్లెందురూరల్: ప్రజల ప్రయోజనార్థం ఒకనాటి ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు, గ్రామపెద్దలు ముక్తకంఠంతో మండలంలో వైన్స్ షాప్ ఏర్పాటును తిరస్కరించారు. ఎక్సైజ్ అధికారులు పలుమార్లు గ్రామసభలు నిర్వహించినా తమ పట్టు వీడకపోవడంతో జిల్లాలో వైన్స్‌షాప్ లేని మండలంగా ఇల్లెందు దశాబ్దానికి పైగా కొనసాగుతోంది. కానీ నేటి ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు, గ్రామపెద్దల్లో ఆ ఆదర్శం కొరవడినట్లుంది. ఒక్క వైన్స్‌ను తిరస్కరిస్తే ఏమిటి.. ఊరంతా పదుల సంఖ్యలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

దశాబ్దం క్రితం ఆదర్శం

ఏజెన్సీ ప్రాంతాల్లో వైన్స్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ గ్రామసభ ఆమోదం తప్పనిసరి. ప్రజల ఆమోదం పొందాకే ఆయా ప్రాంతాలను టెండర్ ప్రక్రియలో పొందుపరుస్తారు. 2012 సంవత్సరం వరకు ఇల్లెందు మండలం, మున్సిపాలిటీ కలిపి ఎనిమిది వైన్స్ ఉండేవి. ఇందులో ఏడు మున్సిపాలిటీ పరిధిలో, ఒకటి మాత్రమే సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగాయి. 2012లో నిర్వహించిన టెండర్ల సమయాన గ్రామసభలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, రాజకీయ పక్షాల నాయకులు వైన్స్‌ను తిరస్కరించగా ఎక్సైజ్ అధికారులు రద్దుచేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఆ షాప్‌ను కూడా ఇల్లెందు మున్సిపాలిటీ పరిధి, గ్రామపంచాయతీ సరిహద్దులో ఏర్పాటుచేశారు.

బెల్ట్‌షాపుల్లో జోరుగా విక్రయాలు

మండలంలో వైన్స్ లేదని.. ఇక తమ కుటుంబాలు బాగు పడినట్లేనని పలువురు భావిస్తుండగా.. తొలినాళ్లలో పట్టువీడని ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు ఆతర్వాత ఎందుకో కానీ పెద్దగా దృష్టి సారించలేదు. క్రమంగా ఒక్కొక్కటిగా బెల్ట్ షాపులు తెరుచుకోవడం ప్రారంభించాయి. ఎవరి నుంచి కూడా అభ్యంతరాలు లేకపోవడం, వైన్స్ యజమానులే నేరుగా మద్యం చేరుస్తుండడంతో నేడు వందల సంఖ్యలో బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్, సుదిమళ్ల, బొజ్జాయిగూడెం, పూబెల్లి, ఇందిరానగర్, బాలాజీనగర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఏ షాపులో చూసినా మద్యం 24గంటలు అందుబాటులో ఉంటోంది. వైన్స్ ఏర్పాటుకు విధించే నిబంధనలు బెల్ట్ షాపులకు లేకపోవడంతో పాఠశాల, ఆలయం దగ్గరలో ఉందనే భావన లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటుచేసేశారు.

ఇబ్బంది పడుతున్న ప్రజలు

బెల్ట్‌షాపుల జోరుకు రాత్రివేళ మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖమ్మం, కొత్తగూడెం వెళ్లాలన్నా, అక్కడి వచ్చే వారిలో అత్యధికులు సుభాష్‌నగర్ కూడలిలో దిగి ఇళ్లకు కాలినడకన వస్తారు. ఇలాంటి పరిస్థితిలో రాత్రి వేళ మందు బాబుల ఆగడాలు ఇబ్బందికి గురిచేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో అర్ధరాత్రి వరకు మందుబాబులు గడపడం.. గొడవలు పడడం షరామామూలైంది.

మద్యం విక్రయాలను అరికట్టాలి



సుభాష్‌నగర్ కూడలిలో మాకు కిరాణం షాపు ఉంది. పలు షాపుల్లోలాగే మేమూ మద్యం అమ్ముతామనుకుని వచ్చి అడుగుతుంటారు. కొందరి వల్ల అందరికీ ఇబ్బంది ఎదురవుతోంది. అధికారులు స్పందించి మద్యం విక్రయాలను అరికట్టాలి.

– ఏటుకూరి లీలావతి, చిరువ్యాపారి, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి



ఉమ్మడి సుదిమళ్ల జీపీలో వైన్స్‌ను రద్దు చేయించుకున్నాం. కానీ ఇప్పుడు మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, నేతలు మరోసారి చొరవ తీసుకొని బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరగకుండా అరికట్టాలి.

– వరద రామచంద్రయ్య, స్థానికుడు, సుభాష్‌నగర్

ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం



బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు అందితే వెంటనే చర్యలు తీసుకుంటాం. మద్యం అవసరమైన వారు నిర్దేశించిన సమయాల్లో వైన్స్‌ల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. నిబంధనలను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవు.

– రాజశేఖర్, సీఐ, ఎక్సైజ్ శాఖ, ఇల్లెందు

బహిరంగ సభను విజయవంతం చేయండి


కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న నాగేశ్వరరావు


ఇల్లెందు: మాట్లాడుతున్న రవి

కొత్తగూడెంరూరల్: ఆదిలాబాద్ నుంచి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క 200 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసిన సందర్భంగా, ఈనెల 14న మంచిర్యాలలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సూర్యపాలెస్ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మల్లికార్జున్‌ఖార్గె ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఏనుగుల అర్జున్, గౌసుపాషా, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇల్లెందు: మంచిర్యాలలో జరుగు సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జి. రవి కోరారు. బుధవారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 16న ప్రారంభమైన భట్టి పాదయాత్ర ఈ నెల 14న మంచిర్యాలకు చేరుకుంటుందన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని, ఇల్లెందు నియోజకవర్గం నుంచి అత్యధికంగా వెళ్లాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, తిరుమల్, దారావత్ కృష్ణ, గోపాల్, కమల, ఆనంద్, జ్యోతి పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా ఇన్‌చార్జ్ జీఎం సుధాకర్ తెలిపారు. బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు, ఏజీఎం సివిల్ సూర్యనారాయణ, లైజన్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్, రాందాస్, వీరన్న, పొనగంటి అంకూస్, వెంకటేశ్వర్లు, హీరాలాల్, జి.ప్రసాద్, మేఘనాథ్ పాల్గొన్నారు.

సప్తమ వార్షికోత్సవం

ఇల్లెందు: పట్టణంలోని ఇల్లెందుల పహాడ్ 2వ వార్డు శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం ఘనంగా సప్తమ వార్షికోత్సవం వేడుకలు, అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ కటకం పద్మావతీ మహిళలతో హోమం నిర్వహించారు.

కంటివెలుగు శిబిరం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని ఉపసర్పంచ్ జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రతాప్, కంటి వైద్య నిపుణుడు కిషోర్‌లు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది సిహెచ్.సురేష్, వి.రామిరెడ్డి, వి.రమాదేవి పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలి


సింగరేణి(కొత్తగూడెం): సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా


జూలూరుపాడు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సాగునీరు, ఖనిజ, అటవీ సంపద విస్తారంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై పాలకులను నిలదీసేందుకు శుక్రవారం నుంచి ప్రజా పోరు యాత్ర చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, దుర్గారాశి వెంకన్న, వై.శ్రీనివాస్‌రెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, సత్యనారాయణ, మాతంగి లింగయ్య పాల్గొన్నారు.

పాల్వంచ: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికీ సీపీఐ ప్రజా పోరు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, జ్యోతుల రమేష్, గూడెపూరి రాజు, రాకేష్, సారయ్య, జకీరయ్య, పాషా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రజా పోరు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో యాత్ర పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఎస్‌కె. చాంద్‌పాషా, పగడాల అఖిల్, బుడేన్ పాషా, యలబాక రాంబాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాక్షసపాలనను సాగనంపాలి


మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పాలకులు రాక్షసపాలన సాగిస్తున్నారని.. వారిని సాగదోలి కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. మండలంలోని మందేరకలపాడు, కారెగట్టు, మొండికట్టల్లో బుధవారం హాథ్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్, నిరుపేదలకు ఇళ్లు, రైతుల రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొండం వెంకన్నగౌడ్, నాయకులు పైడిపల్లి మనోహర్, శ్రీనివాసరావు, మోహన్‌రావు, సీతారాములు, రవి, రాములమ్మ, సారయ్య, కిరణ్, బండారి వేణు, రమాదేవి పాల్గొన్నారు.

17న విద్యుత్ ఉద్యోగుల సమ్మె

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న సార్వత్రిక సమ్మెలో ప్రతీ ఉద్యోగి, ఆర్టిజన్ పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్‌పీఈ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద సమావేశాన్ని నిర్వహించారు. హేమంత్, రాజేష్, గణేశ్, రఘురామయ్య పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులను పర్మనెంట్ చేయాలి

పాల్వంచరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓ నారాయణకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యదర్శుల నాలుగేళ్ల శిక్షణకాలం పూర్తయిన సందర్భంగా కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని రామచంద్రా డిగ్రీకళాశాల్లో 1977–80 సంవత్సరంలో బీఎస్సీ డిగ్రీ చదువుకుని వివిధ ప్రదేశాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పేదలపాలిట వరం 'కల్యాణలక్ష్మి'


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచరూరల్: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలపాలిట వరం అని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 111 మంది లబ్ధిదారులకు రూ.కోటి 11లక్షల 12 వేల 876 విలువ కలిగిన కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వనమా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమపథకాలు దేశంలో ఎక్కడా అమలుచేయడం లేదన్నారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలకు ఈ పథకాలను రాష్ట్రంలో సీఎం అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని కేసీఆర్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగాప్రసాద్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, పెద్దమ్మగుడి చైర్మన్ మహిపతి రామలింగం, సర్పంచ్ అనిత, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లెల శ్రీరాంమూర్తి, నాయకులు పెద్దమ్మగుడి డైరెక్టర్ ఎస్‌వీఆర్‌కె ఆచార్యులు, బేతశెట్టి విజయ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణరావు, ఆత్మకమిటీ డైరెక్టర్ కాల్వ ప్రకాశ్‌రావు, కొత్తపల్లి సోమయ్య, దుర్గాప్రసాద్, కొర్ర రాములు, ఆర్‌ఐ హచ్చా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


బేతంపూడిలో బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలంలో ఆమె పర్యటించారు. వెంకట్యాతండా, బేతంపూడి లో పార్టీ జండాను ఆవిష్కరించి, సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బేతంపూడి, చీమ్లాతండా, సాయన్నపేట గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు పార్టీలో చేరేందుకు రావడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బేతంపూడి గ్రామంలోకి రావాలంటే వర్షాకాలంలో కరిసెలవాగు కోతకు గురవుతూ రాకపోకలకు ఇబ్బంది కలుగుతుండటంతో బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాణోతు హరిసింగ్‌నాయక్, ఎంపీపీ భూక్య రాధ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, సర్పంచ్ యదళ్లపల్లి బాబు, బాణోతు కిషన్, బాణోతు రామ, చీమల సత్యనారాయణ, లక్‌పతి, హుస్సేన్, స్వామి, లక్కినేని శ్యాం, పాపా జాటోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల తీరుతోనే ప్రమాదం

జూలూరుపాడు: కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఘటన బాధాకరమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు లకావత్ లచ్చు నాయక్, మందా బాబు, తాళ్లూరి అచ్చయ్య, బానోత్ బాబు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో జరిగిన ఘటనలో మృతులకు కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ బీఎంపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ... బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

ప్రమాదానికి ఎంపీ, ఎమ్మెల్యే బాధ్యత వహించాలి

కొత్తగూడెంఅర్బన్: బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కావడం కాకున్నా.. అమాయకులు మాత్రం బలవుతున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఘటనకు ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాములునాయక్ బాధ్యత వహించడమే కాకుండా బాధిత కుటుంబాల వారికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీపావళి సందర్భంగా టపాకాయలు అమ్ముకోవడానికి సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు ఇలాంటి ఘటనలపై ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని సూచించారు. సమావేశంలో నాయకులు గంధం మల్లికార్జునరావు, సాయి, చెనిగారపు నిరంజన్ కుమార్, మాలోత్ వీరునాయక్, వేణు పాల్గొన్నారు.

గ్రామదీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

పాల్వంచ: గ్రామదీపికలను(వీఓఏ) ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ అన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వీఓఏలు 1500 మంది ఉన్నారని, వారి శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేసినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కె.సత్య, జిల్లా నాయకులు రమేశ్, అనురాధ, రమాదేవి, ఉమా, కృష్ణవేణి, పద్మ, రమణ, రోజా, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఐఎఫ్‌టీయూ మహాసభలు

టేకులపల్లి: ఈనెల 16, 17, 18 తేదీల్లో ఏపీలోని తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం టేకులపల్లి ఏరియా ప్రధాన కార్యదర్శి రాయండ్ల కోటిలింగం అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కేటీసీలో, టేకులపల్లి హైటెక్ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న ఏపూరి బ్రహ్మం

ఇల్లెందురూరల్: సీపీఐ అనుబంధ అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం మండలంలోని 21పిట్ ఏరియాలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఏఐకేఎస్ పతాకాన్ని సీపీఐ మండల కార్యదర్శి ఉడత ఐలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపూరి బ్రహ్మం మాట్లాడుతూ.. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం, రుణమాఫీ చట్టం కోసం పోరాటాన్ని సాగించిన ఏఐకేఎస్ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చేందుకు యత్నించిన మూడు నల్లచట్టాలను వెనక్కు తీసుకునే వరకు రైతుల పక్షాన పోరాటం నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్ల శ్రీనివాస్, బంటు యాదగిరి, బొప్పిశెట్టి సత్యనారాయణ, బజారు ఆంజనేయులు, బాషిపాక రవి, హతిరాం, శంషుద్దీన్, వలి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

టేకులపల్లి: ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం బోడు పోలీసు స్టేషన్ పరిధిలోని బర్లగూడెం పంచాయతీ మొట్లగూడెం గ్రామంలో స్థానిక ఆదివాసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్లను అందజేసి వారితో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంజిత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం


కవులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ప్రముఖ కవి ఎంఆర్‌జీకే. మూర్తి హాజరై కవులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్లు మోరె భాస్కర్‌రావు, అక్కిరాజు గణేష్, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది, వరలక్ష్మీదేవి, జి. మణిమృదుల, నవీన్, మధు బాబు తదితరులు పాల్గొన్నారు.